నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | ఏప్రిల్ 29, 2024 | www.navatelangana.com



## మంగళసూత్రం చోరీ

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లంబాడితండా గ్రామంలో మహిళ మెడలోంచి మంగళసూత్రం చోరీకి గురైనట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సత్తవ్వ శనివారం రాత్రి ఇంటి ముందు వరండాల్లో నిద్రించింది. ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి మెడలో ఉన్న మంగళ సూత్రాన్ని లాక్కెళ్లాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చోరీకి గురైన బంగారం తులంన్నర ఉండగా సుమారు రూ.45వేల విలువ ఉంటుంది. సంఘటన స్థలాన్ని ఏసీపీ రవికుమార్, సీఐ శశిధర్‌రెడ్డి పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేశారు.



## షార్ట్ సర్క్యూట్‌తో వడ్ల బస్తాలు దగ్ధం

లక్సెట్టిపేట : షార్ట్ సర్క్యూట్‌తో వడ్ల బస్తాలు దగ్ధమైన ఘటన మండలంలోని శాంతపూర్ గ్రామ శివారులో జరిగింది. ఐకేపీ ఆధ్వర్యంలో రైతుల వద్ద కొన్న వరి ధాన్యాన్ని బస్తాల్లో నింపి మిట్టపెల్లిలో గల రైస్ మిల్లుకి తరలించే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లకు తగిలి వడ్ల బస్తాలు కాలిపోయాయి. రహదారిపై ప్రయాణించే సమయంలో ఒక్కసారిగా వడ్ల బస్తాల నుండి పొగలు రావడంతో స్థానికులు గమనించారు. వెంటనే అప్రమత్తమై రహదారి పక్కన ఉన్న వ్యవసాయ భూమి వద్ద లారీని నిలిపి పంపు సాయంతో నీటిని వడ్ల బస్తాలపై చల్లి మంటలు ఆర్పారు. స్థానికులు స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అధిక లోడ్‌తో ఉన్న లారీ హైటెన్షన్ వైర్‌లకు తగలడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.



# సంక్షోభంలో పత్తి పరిశ్రమలు..!

- ప్రభుత్వ ప్రోత్సాహకాలు లేక నష్టాల బాట
- జిల్లాలో ఇప్పటికే కొన్ని మూత..మరికొన్ని అదే దారిలో
- అధికంగా పొరుగు రాష్ట్రానికి వెళ్తున్న మన పత్తి
- సమస్యల వలయంలో జిన్నింగ్ పరిశ్రమలు

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని జిన్నింగ్ పరిశ్రమలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అవసరమైన ప్రోత్సాహకాలు లభించకపోవడంతో నష్టాల బాటన పయనమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని జిన్నింగ్ మిల్లులు మూతపడగా.. మరికొన్ని అదే దారిలో ఉన్నట్లు కనిపిస్తోంది. అధిక విద్యుత్ ఛార్జీలు, ఏండ్ల తరబడి జీఎస్టీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం, మార్కెట్ ఫీజును కూడా అమాంతం పెంచడం కారణంగా ఇక్కడ పండిస్తున్న పత్తి పంటను రైతులు మహారాష్ట్రకు తరలించడం వంటి కారణాలతో జిన్నింగ్ పరిశ్రమలు అవరోధాలు ఎదుర్కొంటున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఫలితంగా జిన్నింగ్ మిల్లులను నడపడమే కష్టంగా మారుతోందని యజమానులు చెబుతున్నారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించి ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు దృష్టిసారించకపోవడం మూలంగా వేలాది మంది ఉపాధికి దూరం కావాల్సి వస్తోందనే వాదన వినిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని జిన్నింగ్ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక కథనం..**



పట్టణ శివారు ప్రాంతంలో జిన్నింగ్ మిల్లు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ రూరల్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే పత్తి పంటకు ప్రధాన కేంద్రంగా పిలుస్తారు. ఈ పంటకు అనుబంధంగా అనేక జిన్నింగ్ పరిశ్రమలు వెలిశాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 200వరకు జిన్నింగ్ మిల్లులు నెలకొల్పగా.. వేలాది మంది వీటి ద్వారా ఉపాధి పొందేవారు. కానీ పరిశ్రమలకు ప్రభుత్వాలు రాయితీలు ఇవ్వకపోవడం కారణంగా అనేక పరిశ్రమలు నష్టాలు మూటగట్టుకున్నాయి. ఫలితంగా ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 90 నుంచి 100వరకు మాత్రమే జిన్నింగ్ పరిశ్రమలు కొనసాగుతున్నాయి. మిగితా వాటిని గోదాములుగా మార్చడం..ఇతర అవసరాలకు వినియోగించుకోవడం వంటి సందర్భాలున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో నాణ్యమైన పత్తి పండటం మూలంగా అంతర్జాతీయంగా డిమాండ్ ఉంటుంది. కొన్నేండ్ల క్రితం వరకు ఓ వెలుగు వెలిగిన ఈ జిన్నింగ్ పరిశ్రమలకు అవసరమైన ప్రోత్సాహం లేకపోవడం కారణంగా అవస్థల వలయంలో చిక్కుకుంటున్నట్లు తెలుస్తోంది. పక్కనున్న మహారాష్ట్రతో పోల్చితే ఇక్కడ విద్యుత్ మినిమం ఛార్జీలు ఎక్కువగా ఉంటుంది. ఇక్కడకు..అక్కడకు ప్రతి నెలా సుమారు రూ.50వేల వరకు బిల్లులో తేడా వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు. ముఖ్యంగా జిల్లాలో ఏడాదిలో కేవలం 4నెలలు మాత్రమే జిన్నింగ్‌లు పనిచేస్తుంటాయి. మిగితా ఎనిమిది నెలలు మిల్లులు నడవకుండా ఖాళీగా ఉన్నప్పటికీ విద్యుత్ ఛార్జీలు మాత్రం తప్పనిసరిగా చెల్లించాల్సి వస్తోంది. ఇలా ప్రతి ఏటా రూ.4లక్షల వరకు కేవలం ఈ ఛార్జీలు చెల్లించేందుకే వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పొరుగు రాష్ట్రానికి మన పత్తి..!**

మహారాష్ట్రలో రైతులకు మార్కెట్ ఫీజు మినహాయింపు ఉంటుంది. ఇదే మన దగ్గర మాత్రం రైతులు కచ్చితంగా మార్కెట్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఒకప్పుడు కిలో పత్తికి కేవలం రూ.40వరకు మార్కెట్ ఫీజు ఉండగా.. ప్రస్తుతం కిలోకు రూ.70నుంచి రూ.80వరకు ఈ ఫీజు చెల్లించాల్సి వస్తోంది. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని అనేక మంది రైతులు నాణ్యమైన పత్తిని పొరుగు రాష్ట్రానికి తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. దీంతో మన దగ్గర నాణ్యమైన పత్తి మార్కెట్‌కు రాకపోగా.. కొరత ఏర్పడటం కారణంగానూ సమస్యలు తలెత్తుతున్నాయి. దీని కారణంగా రాష్ట్ర ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో రావాల్సిన ఆదాయం కూడా పొరుగు రాష్ట్రానికి వెళ్లిపోతోంది. మరోపక్క 2014-15 నుంచి జీఎస్టీ బకాయిలు ఇప్పటికీ రావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఇలాంటి సమస్యల కారణంగానూ జిన్నింగ్‌లు నడపటం కష్టంగా మారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోపక్క జాతీయంగా మార్కెట్‌లో బేళ్ల ధరల్లో హెచ్చుతగ్గులు ఉండటం..అమాంతం ధరలు తగ్గిపోవడం కారణంగానూ వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలుస్తోంది. ఫలితంగా జిన్నింగ్ మిల్లులు నడిపించడం కష్టంగా మారడంతో ఈ పరిశ్రమలు మూతపడుతున్నాయని తెలుస్తోంది.



కార్మికులు, పనులు లేక వెలవెలబోతున్న జిన్నింగ్ మిల్లు

**ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలి : రాజు చింతావార్, జిల్లా అగ్రో ఇండస్ట్రీస్ సంఘం అధ్యక్షుడు**



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమలకు అవసరమైన రాయితీలు కల్పించాలి. ఇప్పటికే జీఎస్టీ అమలవుతున్న దృష్ట్యా మార్కెట్ ఫీజు మినహాస్తే రైతులు పత్తిని ఇక్కడే విక్రయించేందుకు అవకాశం ఉంటుంది. మరోపక్క విద్యుత్ ఛార్జీలపైనా ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది. ప్రభుత్వాలు అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తే పరిశ్రమలు కొనసాగడంతో పాటు పలువురికి ఉపాధి లభిస్తుంది.

## కాంగ్రెస్ అభ్యర్థి సుగుణక్కను గెలిపిద్దాం



నవతెలంగాణ-బేల

మండలంలోని జునోని గ్రామంలో ఆదివారం గడపగడపకు వెళ్లి సుగుణక్కను గెలిపించాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే నల్లధనం వెలికి తీసి రూ.15లక్షలు జమ చేస్తామన్న మోడీ ప్రభుత్వం ఇంతవరకు ఎందుకు జమ చేయలేదన్నారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పేదలకు చేసిందేమీ లేదన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇల్లు నిర్మిస్తామన్న బిజెపి ప్రభుత్వం ఏ ఒక్క పేదోడికి ఆ పథకం కింద ఇల్లు నిర్మించలేదని తెలిపారు. అందుకే కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో అధికారంలోకి తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను అనుకున్నట్లుగా అమలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాపురావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాకేష్ బన్కర్, నాయకులు రుషిరామ్, కన్య రాజు, మండలం యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ విపిన్ ఠాక్రే, సామ రాంరెడ్డి, రాకేష్, ప్రశాంత్‌రెడ్డి, తులసీరామ్, గురుదేవ్, మోరేశ్వర్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న అశ్విన్‌రెడ్డి ప్రజా యాత్ర



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపే లక్ష్యంగా అశ్విన్‌రెడ్డి చేపట్టిన ప్రజా యాత్ర ఆదివారం మండలానికి చేరుకుంది. ఇందులో భాగంగా మండలంలోని వర్తమన్నూర్, పిప్రి గ్రామాల్లో కోవ దౌలత్‌రావ్ మోకాశితో కలిసి గడపగడపకు కాంగ్రెస్ అనే నినాదంతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సామానపెల్లి శేఖర్, మాజీ జడ్పీటీసీ మునేశ్వర్ నారాయణ, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు రాఘన్‌రెడ్డి, లింగారెడ్డి, సురేష్‌రెడ్డి, ఆకుల సుభాష్, మోహన్‌రెడ్డి, బొంగురాల నారాయణ, రాఘవరెడ్డి, సాగర్‌రెడ్డి, జాదవ్ సుభాష్ పాల్గొన్నారు.


## మే డే వాల్‌పోస్టర్లు విడుదల




నవతెలంగాణ-ఇచ్చోడ

ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే వాల్‌పోస్టర్లను సివిల్ సప్లై హమాలీ కార్మిక సంఘ నాయకులు మండల కేంద్రంలో విడుదల చేశారు. మార్కెట్ కమిటీ కార్యాలయ ఎమ్ఎల్ఎస్ గోదాం విడుదల చేసి నాయకుడు దుబాక అశోక్ మాట్లాడారు. 138 మే డే దినోత్సవం సందర్భంగా కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున పాల్గొని పండగల నిర్వహించాలని కోరారు. సివిల్ సప్లై హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, లేని యెడల భవిష్యత్‌లో సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెడపట్ల రాజేందర్, ముద్గు శంకర్, వెంకటేష్, లక్ష్మణ్, సాయికుమార్ పాల్గొన్నారు.

## ఉచిత అంబలి పంపిణీ ప్రారంభం



నవతెలంగాణ-నస్పూర్

కొక్కిరాల రఘుపతిరావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత అంబలి పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ట్రస్టు ప్రధాన కార్యదర్శి కొక్కిరాల సత్యపాల్‌రావు ప్రారంభించారు. నస్పూర్ మున్సిపల్ పరిధిలోని సీసీసీ కార్నర్, శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద ఉచిత అంబలి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్య పాల్‌రావు మాట్లాడుతూ వేసవికాలంలో చలివేంద్రాలతో పాటు అంబలి కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి రుక్మిణి, మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్
- ఆదివాసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో గిరిజనుల స్థితిగతులు మరింత దిగజార్చి, ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న గిరిజన చట్టాలను నీరుగార్చి అడవుల ప్రయివేటీకరణ పేరుతో ఆదివాసుల హక్కులను కాలరాసిందని టీఏజీఎస్(తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాలు - ఆదివాసులపై ప్రభావం అనే అంశంపై ఆదివాసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 1952 గిరిజన పంచశీల సూత్రాలకు భిన్నంగా నూతన గిరిజన విధానం తీసుకొచ్చి భారత రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక హక్కులను హరించే విధంగా అమలు జరుపుతోందన్నారు. 2020 గిరిజన విధానంతో గిరిజన సంక్షేమం, అభివృద్ధిని స్వచ్ఛంద సంస్థలకు ఎరగా వేయడం, గిరిజన భూములను, అడవులను కార్పొరేట్లకు అప్పజెప్పడం వంటివి చేస్తుందన్నారు. 2014లో అధికారంలోకి రాగానే ప్రణాళిక సంఘం రద్దు చేయడం, సబ్‌ప్లాన్ నిధుల నిలిపివేత, ఆర్టికల్ 275(1) ప్రకారం భారత సంచిక నిధి నుండి గిరిజన ప్రాంతాలకు ఇవ్వాల్సిన సాయం (గ్రాంట్ ఇన్ ఎయిడ్) రద్దు చేసిందని అన్నారు. గిరిజనులు సేకరించే తేలికపాటి అటవీ ఉత్పత్తులపై కనీస మద్దతు ధర నేటికీ ఇవ్వలేదన్నారు. జీసీసీ/టీఆర్ఐఎఫ్ఈడి సంస్థలు నిధులను సమీకరించకుండా గిరిజన ప్రజలు సేకరించే ఉత్పత్తులను ఈ సంస్థలు



కొనరాదని నిషేధం విధించిందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో తునికాకు బోనస్ సుమారు రూ.600 కోట్లు 2016 నుండి చెల్లించడం లేదన్నారు. ఉపాధి అవకాశాలను మెరుగు పర్చాల్సిన కేంద్రం అందుకు విరుద్ధంగా ఉపాధిని దెబ్బకొట్టే విధానాలు అవలింబిస్తోందని తెలిపారు. తెలుగు రాష్ట్రాలలో అమలవుతున్న జీఓ నెం.3ను సుప్రీం కోర్టు ద్వారా రద్దు చేయించి ఆదివాసీ యువతకు ఉద్యోగాలలో నష్టం చేసిందని తెలిపారు. గిరిజన ప్రాంతాలలో ఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని ఎత్తివేయడం, నిధులలో కోత విధించడంతో గిరిజనుల ఆర్థిక స్వావలంబనకు విఘాతం కల్గించేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయన్నారు. కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ను రద్దు చేసినట్టు గిరిజన ప్రాంతాలలో అమలవుతున్న 5,6 షెడ్యూల్ ప్రాంతాలను రద్దు చేసేందుకు కుట్ర చేస్తున్నారని పేర్కొన్నారు. అటవీ హక్కుల చట్టం, పెసా చట్టాలను నిర్వీర్యం చేసే విధంగా 2022 ఆర్డినెన్స్ ద్వారా గిరిజన విధానపత్రం ఆమోదింపజేసుకుందన్నారు. అడవుల ప్రయివేటీరణ, గిరిజన చట్టాలను నీరుగార్చడం, గిరిజన భూములను లాక్కోవడం ప్రధాన ఉద్దేశంగా ఈ చట్టం తీసుకొచ్చిందన్నారు. మణిపూర్ రాష్ట్రంలో కుకి తెగ ఆదివాసులను ఊచకోత కోస్తూ బీసీలుగా ఉన్న మెయితీలను ఎస్టీ జాబితాలో చేర్చే ఆశచూపి ఘర్షణ వాతావరణం సృష్టించిందన్నారు. షెడ్యూల్ ప్రాంతం 6లో ఉన్న అడవిని కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పి సహజ వనరుల దోపిడీ చేసేందుకు ఈ కుట్ర పన్నిందన్నారు. స్వర్ణ లేదా ఆదివాసీ జనాభాను విడిగా లెక్కించాలని జార్ఖండ్ అసెంబ్లీ తీర్మానం చేసినందుకు ఆదివాసీ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్‌పై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించిందన్నారు. గిరిజన హక్కులకు భిన్నంగా గిరిజన చట్టాలను నీరుగారుస్తూ రిజర్వేషన్లు తొలగిస్తూ ఆదివాసీలను హైందవీకరణ, మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్న బీజేపీ పాలనకు స్వస్థి చెప్పాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్, జిల్లా కార్యదర్శి వెట్టి మనోజ్, కాంగ్రెస్ ఎస్టీ సెల్ చైర్మన్ సెడ్మకి ఆనంద్‌రావు, జెఏవైఎస్ తొడసం శంకర్, ఆదివాసీ నాయకులు కుర్సెంగా తానాజీ, మడావి దిగంబర్, ఉయిక విష్ణు, కొడప సురేష్, ఆత్రం దినేష్, రవి, తొడసం భీంరావు, బి.రాహుల్, జగన్‌సింగ్, బండి దత్తాత్రి, లంక రాఘవులు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేయడమే కాకుండా సంక్షేమ పథకాలు అందించడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పట్టణంలోని భుక్తాపూర్‌లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సక్కు మాట్లాడుతూ బీఆర్ఎస్ కేసీఆర్ నాయకత్వంలో బడుగు బలహీన వర్గాలకు ఉన్నతమైన విద్యకు ప్రాధాన్యం కల్పించిందన్నారు. అలాగే వారి కుటుంబంలో సంక్షేమ పథకాలను అందించి ప్రతి కుటుంబానికి అండగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలు పూర్తిగా గమనిస్తున్నారని, ఈనెల 13న నిర్వహించే ఎంపీ ఎన్నికల్లో ప్రజలు కారు గుర్తుకు బ్రహ్మరథం పడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పండ్ల శ్రీనివాస్, స్వరూపరాణి, బుడగం మమత, రామ్‌కుమార్, నవతె శ్రీనివాస్, కరుణ పాల్గొన్నారు.



## దొంగను పట్టుకున్న పోలీసులు



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని వరుణ్ మద్యం దుకాణంలో దొంగతానికి పాల్పడ్డ మద్దుల రాజశేఖర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..కుప్టి గ్రామానికి చెందిన రాజశేఖర్ కూలి పని చేస్తుంటాడు. తాగుడు, జల్సాలకు అలవాటు పడ్డాడు. డబ్బులు లేకపోవడంతో గురువారం రాత్రి మద్యం దుకాణంలో చోరీ చేశాడు. పోలీసులు సీసీ కెమెరాల ద్వారా నిందితుడిని పట్టుకున్నారు. ఆయన వద్ద నుండి గడ్డపార, పారతో పాటు రూ.14,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. దొంగను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ శ్రీకాంత్‌తో పాటు సిబ్బందిని సీఐ భీమేష్, డీఎస్పీ నాగేందర్ అభినందించారు.

## అథ్లెటిక్స్ స్టేట్ మీట్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

ఆదిలాబాద్‌టౌన్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలో అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అథ్లెటిక్స్ స్టేట్ మీట్ ఆదిలాబాద్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. 100 మీటర్స్ అండర్-18 పరుగుల పోటీల్లో అడ వైష్ణవి సిల్వర్ మెడల్ సాధించారు. 400 మీటర్స్ మహిళల విభాగం పోటీలో ఎన్.అరుణ రజత పతకం సాధించినట్లు కోచ్, మేనేజర్లు రాకేష్, సౌమ్య, జ్యోతిశర్వాన్ తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను పలువురు అభినందించారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | ఏప్రిల్ 29, 2024 | www.navatelangana.com

## మామిడిగూడలో బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



మండలంలో మామిడిగూడ గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కుమ్ర రాజు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కును కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఆత్రం యాదోరావు, సిడం లక్ష్మణ్, కొడప మాదవ్ రావు, ఎస్టీ సెల్ అధ్యక్షులు కుమ్ర మోతిరాం, మార్సుకోల రవి, గణేష్ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా గురుకుల ఏకలవ్య ప్రవేశ పరీక్షలు

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలోని కేబీ కాంప్లెక్స్‌లో తెలంగాణ రాష్ట్ర గురుకుల ఏకలవ్య పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. సెంటర్ వద్ద విద్యార్థులు వారి హాల్ టికెట్లను పరిశీలించుకోని లోనికి వేళ్లి పరీక్ష రాశారు. పరీక్షకు 500 మందికి గాను 464 మంది హాజరైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ తక్షశిల తెలిపారు. 36 మంది విద్యార్థులు గైహాజరైనట్లు పేర్కొన్నారు.

# కనిపించని బీజేపీ ప్రచారం

- మోడీ జపంతోనే కాలం గడుపుతున్న కార్యకర్తలు
- ప్రచార జోరు పెంచిన కాంగ్రెస్
- వెనుకబడిన బీఆర్ఎస్

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, సభలతో ప్రధాన రాజకీయ పక్షాలు తమ బలాన్ని ప్రదర్శిస్తూ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతుంటే ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఖానాపూర్ నియోజకవర్గంలో ఎన్నికల సందడి కనిపించడం లేదు. మైకుల మోత, కార్యకర్తల సందడి ఎక్కడ లేదు. ఎన్నికల ప్రచారానికి మరో రెండు వారాలే మిగిలి ఉన్నప్పటికీ ఈ ప్రాంతాలలో అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించినప్పటికీ పోటీలో ఉన్న మిగతా రెండు ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ ప్రచార ఊసే లేకుండా పోయింది. మోదీ జపంపై ప్రధాన ఆశలు పెట్టుకున్న బీజేపీ సైతం ఇప్పటి వరకు ఖానాపూర్ నియోజకవర్గంలో ప్రచారాన్ని చేసిన దాఖలు కనిపించ లేదు. ఎన్నికలు అంటేనే ఓటరును ప్రసన్నం చేసుకోవడానికి కార్యకర్తలు వివిధ రకాలుగా ప్రచారం చేయాలి. తమ పార్టీ విధానం, ఎజెండా అంశాలు, భవిష్యత్‌లో చేయబోయే అభివృద్ధి పనుల గురించి వివరిస్తూ ప్రజలను ఆకట్టుకోవాలి. కానీ ఖానాపూర్‌లో బీజేపీ నాయకుల ప్రచారం ఏమాత్రం కనిపించడం లేదు. ప్రధాన మంత్రి మోడీ జాపంతోనే ఓట్లు పడుతాయన్న ధీమాతో ఆపార్టీ కార్యకర్తలు సమయాన్ని గడిపేస్తున్నారు. ఎన్నికలకు మరో పదిహేనురోజుల సమయం మాత్రమే ఉంది. బీజేపీ నాయకులు మాత్రం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంపై అంతగా శ్రద్ధ కనబరచడంలేదు. స్థానికంగా బీజేపీ పట్ల ప్రజల్లో కొంత మేరకు ఆదరణ ఉన్నప్పటికి నాయకుల తీరుపట్ల తీవ్ర వ్యతిరేఖత వ్యక్తమవుతోంది. బీజేపీకి కార్యకర్తలు ఉన్నారా..? లేరా..? అన్నా విమర్శలు చేస్తున్నారు. ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో మండలంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో దూకుడు పెంచింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మండలంలో బీజేపీ, బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్ పార్టీకి తక్కువ ఓట్లు వచ్చిన దృష్ట్యా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఇక్కడ ప్రత్యేక దృష్టి సారించారు. కార్యకర్తలతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ సైతం విస్తృతంగా పర్యటిస్తున్నారు.

**బీజేపీ అభ్యర్థిపై అసంతృప్తి**

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లాల్లో పర్యటిస్తున్న బీజేపీ అభ్యర్థి గేడం నగేష్ ఇప్పటి వరకు ఖానాపూర్ నియోజకవర్గానికి రాలేదు. ఎన్నికల షెడ్యూల్ ముందు వరకు ఇతర పార్టీలో ఉన్న నగేష్‌ను బీజేపీలోకి తీసుకొని టికెట్ ఇవ్వడం పట్ల తీవ్ర వ్యతిరేఖత వ్యక్తమవుతోంది. సిద్ధాంతాలకు కట్టుబడే పార్టీ అని గొప్పగా చెప్పుకునే బీజేపీ ఎంపీ అభ్యర్థి విషయంలో తీసుకున్న నిర్ణయాన్ని కార్యకర్తలు, ప్రజలు తప్పుబడుతున్నారు. కొత్తగా పార్టీలో చేరిన నగేష్‌కు బీజేపీ క్యాడర్‌ను కలుపుకొని పోవడం సమస్యగా మారినట్లు చెబుతున్నారు. పార్టీ కార్యకర్తలు సైతం ఆయన పట్ల మనకెందుకులే అనే దోరణితో కనిపిస్తున్నారు. ఇదిలా ఉంటే కార్యకర్తలను బుజ్జగించాల్సిన అభ్యర్థి మోడీ క్రేజ్‌తో గెలుస్తామనే ధీమా ఇక్కడి కార్యకర్తలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. క్యాడర్‌ను బీజేపీ ఎలా కాపాడుకుంటుంది.. ఎన్నికల వ్యూహం ఎంటి అనే స్పష్టత మరో 15 రోజుల్లో వస్తుంది.



ఇటీవల నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

**దూకుడు పెంచిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్**

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని నియోవజకవర్గంలో అభ్యర్థి కంటే ఎక్కువగా పర్యటిస్తున్నారు. కార్యకర్తలతో సమావేశాలు, సభలు నిర్వహిస్తునే దిశానిర్దేశం చేస్తున్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్ది ఎమ్మెల్యే అభ్యర్థి తరపున ప్రచారంలో మరింత దూకుడు పెంచారు. అభ్యర్థి ఆత్రం సుగుణ కూడా విస్తృతంగా పర్యటిస్తు ప్రజలతో మమేకం అవుతున్నారు. ఎది ఎమైన ప్రచారంలో కాంగ్రెస్ చూపుతున్న జోష్ ఇతర పార్టీలు చూపడం లేదు.

**జాడలేని బీఆర్ఎస్**

అసెంబ్లీ ఎన్నికల తరువాత రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ జాడ కనిపించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్ టికెట్ ఆశించిన ఆత్రం సక్కును బుజ్జగించి ఎంపీ టికెట్‌ను అదిష్టానం ఇచ్చింది. అయితే ఆయన కూడా ఖానాపూర్ నియోజకవర్గంలో ప్రచారానికి ఇప్పటి వరకు రాలేదు. ఇక్కడ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన జాన్సన్ నాయక్ కూడా ప్రచారం ప్రారంభించలేదు. నిరుత్సహంలో ఉన్న కార్యకర్తలు మరింత జోష్‌గా పని చేసేలా అభ్యర్థితో పాటు ఇతర పెద్ద నాయకులు ప్రచారం చేయాల్సిన అవసరముంది.

## ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండలంలోని కొత్తూరు గ్రామ శివారులో వ్యవసాయ బావిలో పడి లాల్ దాస్ కొంరే(31) అనే మధ్యప్రదేశ్‌కు చెందిన యువకుడు బావిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ పి చంద్రకుమార్ తెలిపారు. మృతుడు గత ఐదు రోజుల క్రితం తన గ్రామానికి చెందిన మరో నలుగురు మిత్రులతో కలిసి లక్షెట్టిపేట పట్టణంలోని కరీంనగర్ చౌరస్తాలో గల మామిడి కాయలు మండిలో పనిచేయడానికి వచ్చాడు. అందరితో కలిసి వచ్చిన అతను ఒక్కరోజు మాత్రమే పనిచేసి వచ్చిన కూలి డబ్బులు తీసుకొని ఇంటికి వెళ్తానని చెప్పి వెళ్ళిపోయాడు. ఈ రోజు ఉదయం కొత్తూరు గ్రామంలోని వ్యవసాయ బావిలో కొంత మందికి శవం కనిపించడంతో వెళ్లి దర్యాప్తు చేపట్టగా మృతుని ఆచూకీ తెలిసింది. మృతునికి మద్యం తాగే అలవాటు ఉంది. మద్యం మత్తులో నడుచుకుంటూ వెళ్ళి ప్రమాదవశత్తు బావిలో పడి మృతి చెందివుంటాడని మృతునికి వరుసకు బావమరిది అయిన సంజీవ్ దుర్వే ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటన స్థలానికి సీఐ నరేందర్ వచ్చి పరిశీలించారు.

## ఆత్రం సక్కు గెలుపు కోసం ముమ్మర ప్రచారం



నవతెలంగాణ-తాంసి

బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపే లక్ష్యంగా మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ముమ్మర ప్రచారంలో భాగంగా ఆదివారం ఘోట్కూరి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పది సంవత్సరాలుగా కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను ఓటర్లకు వివరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రమణ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. కళ్యాణలక్ష్మి పథకం నిరుపేద కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఆదుకుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు అధికారం కోసం అమలుకానీ హామీలు ఇచ్చి ప్రజలను, రైతులను మోసం చేశాయని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వినోద్‌రెడ్డి, మహేందర్, క్రిష్ణ, గోవర్ధన్‌రెడ్డి, భగవాండ్లు, అశోక్, శ్రీనివాస్, కాంతారెడ్డి, రఘు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఐకాన్ అవార్డు పొందిన 'ప్రేమతో నాన్న' చిత్రం

నవతెలంగాణ-లక్ష్మణచాంద





డాక్టర్ వేణు గోపాల కృష్ణ నటించిన 'ప్రేమతో నాన్న', మహారాజు ఆవేదన చిత్రాలకు ఆదివారం హైదరాబాద్‌లోని ప్రముఖ సినీ నిర్మాణ సంస్థ మెగా ఎంటర్ ప్రైజెస్ ఉగాది నంది పురస్కారాలు, ఐకాన్ అవార్డులు ప్రకటించారు. ప్రేమతో నాన్నలో నటించిన నటి సుహాసిని చక్కని నటన, వేదం, భరత నాట్యం ప్రదర్శించి ఉత్తమ నటిగా ఎన్నికయ్యారు. సంస్కృతి, సాంప్రదాయాలు, కుటుంబ విలువలున్న ప్రేమతో నాన్న, మహారాజు ఒక రైతు బాధను వర్ణించే చిత్రం. రోడ్డు ప్రమాదాలు జాగ్రత్తలపై తీసిన ఆవేదన చిత్రాలు ఉత్తమ చిత్రాలుగా ఎన్నికయ్యాయి. ప్రేమ, త్యాగం దుఃఖం, ఆర్ధత, వివిధ భావ ప్రకటనలు, అంగీకం, వాచికం సహజంగా నటించిన డా. వేణుగోపాలకృష్ణకు ఉత్తమ నటుడుగా పురస్కరం దక్కింది. రెండు రాష్ట్రాల నుంచి వచ్చిన ఎన్నో చిత్రాలు పరిశీలించి ఈ అవార్డులు ప్రకటించారు. ఉత్తమ నటి, నటులుగా ఎంపికైన వీరికి పలువురు ప్రముఖులు, సాహిత్య పోషకులు అభినందనలు తెలిపారు.

## బీజేపీ గెలిస్తే రిజర్వేషన్లు పోవడం ఖాయం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- మండలంలో ముమ్మరంగా ప్రచారం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపిస్తే రిజర్వేషన్లు తీసివేయడం ఖాయమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని అప్పపెల్లి, మోతుగూడ, అంకుషాపూర్ గ్రామాల్లో పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మతం అడ్డం పెట్టుకుని బీజేపీ పరిపాలన చేయడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే రిజర్వేషన్లు పోవడం ఖాయమన్నారు. కాంగ్రెస్ లౌకిక వాదానికి కట్టుబడి ఉందని, అన్నిరంగాల అభివృద్ధి గతంలో కాంగ్రెస్ హయాంలో జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎంపీ అభ్యర్థులుగా ఉన్న నాయకులు గతంలో వారు అధికారంలో ఉండగా ఏం చేశారని ప్రశ్నించారు. ప్రజలు చాలా తెలివిగలవారని, వారికి తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. బీఆర్ఎస్ గత 9 సంవత్సరాల్లో రాష్ట్రంలో ప్రతి పథకంలో అవినీతి చేసిందని ఆరోపించారు. ఆ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏది లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మాసాడే చరణ్, నాయకులు మంగ, మల్లేష్, రాజేశ్వరి, సీపీఐ నాయకుడు బద్రి సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-రెబ్బెన

మండల కేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల వ్యవస్థాపక చైర్మన్ స్వర్గీయ తునికి ప్రభాకర్ రాజు 74వ జయంతి సందర్భంగా కళాశాలలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రాజు, డైరెక్టర్ శశిధర్‌రాజు, గణితశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ నవీన్ చందర్ రాజు పాల్గొన్నారు. శిబిరంలో 20 మంది రక్తదాతలు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమం బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డా. నవీద్ అహమ్మద్, ప్రిన్సిపల్ జాకీర్ ఉస్మానీ, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చూసి ఆదరించండి

నవతెలంగాణ-బెజ్జూరు

గత ప్రభుత్వ హయాంలో తాము చేసిన అభివృద్ధిని చూసి తమను ఆదరించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. ఆదివారం మండలంలోని కుకుడ, కాటపెల్లి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమల్లో తమ ప్రభుత్వం ఎంతో చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు కోత విధించి రైతులకు అన్యాయం చేసిందన్నారు. ఐదెకరాలలోపు రైతులకు మాత్రమే రైతుబంధు అందించిందని, మిగతా రైతులను మోసం చేసిందని ఆరోపించారు. రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని విస్మరించి కల్లబొల్లి కథలు చెపుతుందన్నారు. ఎంపీ ఎన్నికల్లో ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తామన్నారు. అనంతరం వివిధ పార్టీల నుండి వచ్చిన కార్యకర్తలకు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సోయం చిన్నయ్య సామల రాజన్న, అస్లాంఖాన్ పాల్గొన్నారు.

## పేదవారికి తోడుగా ఉంటూ సేవలందిస్తాం : సంతోష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బ్రాహ్మణుల్లో చాలా మంది పేదవారున్నారని అలాంటి వారికి తోడుగా ఉంటూ సేవలు అందిస్తానని బ్రాహ్మణ్ సమాజ్ నూతన అధ్యక్షుడు అన్నోజుల సంతోష్ అన్నారు. గత నెల 14 నెల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన నూతన కార్యవర్గం ఆదివారం తిర్పెల్లిలోని రామాలయంలో ప్రమాణ స్వీకరం చేశారు. దీనికి ఎన్టీటీ డాటా బిజినెస్ సొల్యూషన్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సంజీవ్ దేశ్ పాండే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆలయంలో పూజలు చేశారు. అనంతరం సంజీవ్ దేశ్ పాండే దంపతులను సమాజ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకరం చేశారు. మూడు సంవత్సరాల కాలంలో తాను చేసిన అభివృద్ధిని గుర్తించి మరోసారి గెలిపించినందుకు సమాజ్ సభ్యులకు బ్రాహ్మణ్ సమాజ్ నూతన అధ్యక్షుడు సంతోష్ అన్నారు. సమాజంలో అనేక మంది పేద వారే ఉన్నారని వారి అభ్యున్నతికి ప్రభుత్వం పరంగా రావాల్సిన పథకాలను అందించేల తన వంతు కృషి చేస్తానని అన్నారు. సంఘ బలోపేతంతో పాటు ఆర్థికంగా ఎదిగేల శక్తివంచన లేకుండా పని చేస్తానని స్పష్టం చేశారు. ఐకమత్యం, పరస్పర సహకారాలే ప్రస్తుతం బ్రాహ్మణులకు అత్యంత అవసరమని సంజీవ్ దేశ్ పాండే అన్నారు. ఐక్యంగా ఉంటూహక్కులను సాధించుకోవాలన్నారు. దానికి సంఘం సహకారం తప్పనిసరి అవుతుందన్నారు. బ్రాహ్మణ్ సమాజ్ అవసరమైన సహకారం అందించేందుకు ఎల్లవేళాల అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ్ సమాజ్, వైదిక అర్చక పురోహిత సంఘం, గాయత్రి సంఘం నాయకులు ఉన్నారు.

## రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

గిరిజన జిల్లా అయిన ఆదిలాబాద్‌లో గిరిజనులు అధికంగా రక్తహీనతతో బాధపడుతున్నారని అలాంటి వారికి రక్తం అందక ఇబ్బందులు పడుతున్నారని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. ఇదే క్రమంలో సామాజిక బాధ్యతలో కిరాణ అండ్ జనరల్ స్టోర్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో రిమ్స్‌లోని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాజలింగుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానం చేస్తున్న వారితో మాట్లాడుతూ ప్రోత్సహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ జిల్లాలో అధికంగా ఆదివాసులే ఉన్నారన్నారు. గర్భిణీలు రక్తహీనతతో బాధపడుతున్నారని తెలిపారు. వీరితో పాటు సిక్కిల్ సెల్, తలసేమియా వ్యాధి గ్రస్తులకు రక్తం అవసరముంటుందన్నారు. రిమ్స్ నిల్వలు తక్కువగా ఉన్నాయని తెలిపారు. ఇలాంటి సమయంలో కిరాణ అండ్ జనరల్ స్టోర్ వర్కర్స్ అసోసియేషన్ సామాజిక బాధ్యతగా ముందుకు రావడం హర్షనీయమన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకోని ఇతర సంఘాలు కూడా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గణేష్, దాదసాహెబ్, రవీందర్, హేమంత్, నర్సారెడ్డి పాల్గొన్నారు.

## డీబీఎల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- డీవైఎఫ్ఐ ఉపాధ్యక్షుడు పురుషోత్తం

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలో నాలుగు వరుసల రహదారి 2019 సంవత్సరంలో పనులు ప్రారంభమయ్యాని, పనులు పూర్తి కాకముందే డీబీఎల్ కంపెనీ యాజమాన్యం టోల్‌గేట్ ఏర్పాటు చేసి వాహనదారుల నుండి చలాన్లు తీసుకుంటుందని డీవైఎఫ్ఐ ఉపాధ్యక్షుడు పురుషోత్తం అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాతీయ రహదారిపై బస్టాండు లేక ఎండలకు ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా డీబీఎల్ యాజమాన్యం గ్రామాల్లో జాతీయ రహదారిపై తక్కళ్లపల్లి, గోలేటి, పులికుంట, పుంజుమేరగూడ, నక్కలగూడ, ఇందిరానగర్, మద్దికుంట, ఎడవెల్లి, ఖైర్‌గాం గ్రామాల్లో బస్టాండు వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆయా గ్రామాలకు బస్టాండు, చేతిపంపు ఏర్పాటు చేసే విధంగా డీబీఎల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి చాపిడి శివ, ఉపాధ్యక్షుడు చల్లూరి కృష్ణ పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-రెబ్బెన

మండల కేంద్రంలో భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు పోటు శ్రీధరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. అదేవిధంగా ప్రస్తుతం అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అని చెప్పి ప్రజలను మబ్యపెడుతూ వారు చేస్తున్న పథకాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను గడపగపకు వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మి సౌందర్య ఆనంద్, ప్యాక్స్ చైర్మన్ కార్నాదం సంజీవ్‌కుమార్, వైస్ చైర్మన్ రంగు మహేష్ గౌడ్, వైస్ ఎంపీపీ గజ్జెల సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యులు జహీరొద్దీన్, మహిళా అధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ మురళీగౌడ్, జిల్లా మహిళా నాయకురాలు కుందారపు శంకరమ్మ ధాన్యం పద్మ, ఎంపీటీసీలు సంగం శ్రీనివాస్, వెంకటేశం చారి, రెబ్బెన మాజీ సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, బుర్స పోచమల్లు, పందిర్ల మధునయ్య, విలాస్, ధామోధర్, తిరుపతి పాల్గొన్నారు.

## సంచార ముస్లిములకు గుర్తింపు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఉరూరా తిరుగుతూ జీవనం సాగిస్తున్న సంచార ముస్లీంలకు గుర్తింపు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ సంచార ముస్లీం తెగల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సైదాఖాన్ కోరారు. ఆదివారం పట్టణంలోని కేఆర్కే కాలనీలో నిర్వహించిన సంఘం జిల్లా ఎన్నికలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంచార ముస్లీంలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కర మార్గాలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎండీ అబ్బాస్, షేక్ అక్రమ్, ఉపాధ్యక్షుడిగా షేక్‌సయ్యద్ హుస్సేన్, కోశాధికారిగా అంజద్, ఉపాధ్యక్షులుగా షాదుల్, రాజ్ మహ్మద్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకొని సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సైదాఖాన్ మాట్లాడుతూ తెలంగాణలో సంచార ముస్లీంలకు గుర్తింపు లేకుండా పోయిందన్నారు. ఉరూరా తిరుగుతూ జీవనం సాగిస్తున్న తాము సామాజిక, ఆర్థికంగా. రాజకీయ. విద్య ఉపాధి, ఉద్యోగ పరంగా వెనకబడి ఉన్నామన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న సంచార ముస్లీంలను ఐక్యం చేసేలా జిల్లాల్లో పర్యటిస్తు కమిటీలను వేయడం జరుగుతుందన్నారు. కమిటీల ఏర్పాటు అనంతరం సమస్యల పరిష్కరం, గుర్తింపు కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బడేసాబ్, పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని రక్షించడానికి బీజేపీని ఓడించాలి

- పౌరసమాజ సదస్సులో ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్ పిలుపు

నవతెలంగాణ-నిర్మల్

భారత దేశంలో పదేండ్లుగా బీజేపీ నిరంకుశంగా పరిపాలన సాగిస్తూ, ఫాసిస్టు పోకడలను ప్రవేశ పెట్టిందని భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పింఛనర్ల భవనంలో టీపీజేఏఎస్ ఆధ్వర్యంలో పౌరసమాజ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై దేశంలో పదేండ్లలో నిరుద్యోగం, ధరలు విపరీతంగా పెంచిందని ఆరోపించారు. ముస్లిం మైనారిటీ ప్రజలను దేశ పౌరులుగా సమానంగా చూడకుండా, వారిని ఆక్రమణ దారులని ఈ దేశ ప్రధాన మంత్రి పిలుస్తున్నాడని, ఇది రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. భవిష్యత్తులో దేశంలో రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే బీజేపీ కూటమిని ఓడించాలని, ఇండియా కూటమిని గెలిపించాలని ఆయన పిలుపు నిచ్చారు. అనంతరం సదస్సులో ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీలు, ఇతర సాధారణ ప్రజలు, ముస్లిం మైనారిటీ ప్రజలు ఐక్యంగా నిలబడి, బీజేపీని ఓడించాలన్నారు. అపుడే ఈ దేశంలో ప్రజలకు ప్రజాస్వామిక హక్కులు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ జోడో అభియాన్ జాతీయ నాయకులు డా.సుకుమార్, తెలంగాణ కన్వీనర్ విస్సా కిరణ్, టీపీజేఏఎస్ కో కన్వీనర్ కన్నెగంటి రవి, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నేడు వడ్రంగి కులస్తుల వధూవర పరిచయ వేదిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విశ్వకర్మ వడ్రంగి మరాఠీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆదిలాబాద్‌లో వధూవర పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్వె సంతోష్, మానుస్కర్ దిలీప్ ఒక ప్రకటన పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు స్థానిక బాలాజీ గార్డెన్‌లో ప్రారంభమవుతుందన్నారు. కులస్తులందరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నవతెలంగాణ
నవతరం తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | ఏప్రిల్ 29, 2024 | www.navatelangana.com

## బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రానికి వచ్చిన పంచాయతీరాజ్ మంత్రి సీతక్క కాంగ్రెస్ నాయకురాలు మర్సుకోల సరస్వతి సోదరుడు కొట్నాక సుధాకర్ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాద్, నియోజకవర్గం ఇన్‌చార్జి శ్యాం నాయక్, మండల అధ్యక్షులు చరణ్ గౌడ్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని విజయనగరం జెయింట్ జోసెఫ్స్ ఉన్నత పాఠశాల 2004-2005 సంవత్సరం విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ప్రధానోపాధ్యాయులు ఫాదర్ జేమ్స్‌తో పాటు ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులు మాట్లాడుతూ అప్పటి ఉపాధ్యాయులు నేర్పిన విద్యాబుద్ధుల వల్లనే నేడు మేమంతా ఈ రోజు ఉన్నత స్థానాలలో ఉన్నామన్నారు. మేము నేర్చిన ప్రతి అక్షరం నేర్పిన గురువులు ఎంతో గొప్పవారన్నారు. 20 సంవత్సరాల తర్వాత ఇప్పుడు ఇదే పాఠశాలలో కలవడం ఎంతో గర్వంగా ఉందని, వారిలోని బావోద్వేగాన్ని తెలియజేశారు. ఈ సమ్మేళనంలో ఫాదర్ సిజో, ఫాదర్ టోం, అప్పటి వైస్ ప్రిన్సిపల్ ఆలీస్, ఉపాధ్యాయులు మారయ్య, ఇందిరాదేవి, వెరోనిక, టి శ్రీనివాస్, జి శ్రీనివాస్, సురేష్, ఘన్‌శ్యాం, నాగేష్, ఎస్ శ్రీనివాస్, నానాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-దహెగాం

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ ఉత్తమ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంగడి బజార్ ఏరియాలో ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ కేటుగాళ్లు ప్రజలను మభ్యపెట్టి అనేక రకాలుగా మోసాలు చేస్తున్నారని, వాటిపట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఆధార్ నెంబర్ కానీ, ఏటీఎం నెంబర్ కానీ, బ్యాంకు ఖాతా నెంబర్లు కానీ అడిగితే ఇవ్వద్దన్నారు. ఫోన్ చేసి లక్కీ టాలరీ తగిలిందని ఓటీపీ నెంబర్ పంపితే మీకు విలువైన బహుమతులు అందజేస్తామని ప్రలోభాలకు గురిచేస్తే అలాంటి వారిని నమ్మవద్దన్నారు. ఎవరైన మోసపోతే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి : సీపీఐ(ఎంఎల్)



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మతోన్మాద ఫాసిస్ట్ బీజేపీకి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పి ఇండియా కూటమి ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి సుగుణక్కను గెలిపించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.శ్రీనివాస్ కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా దేశంలో సుదీర్ఘ పరిపాలన సాగించిన ఆర్ఎస్ఎస్- బీజేపీలో ఫాసిస్టు నియంతృత్వాన్ని దేశంపై రుద్దడానికి తగిన భూమిక తయారు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారన్నారు. పోరాడే సంస్థలు, పోరాటాలపైన తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించడానికి అవసరమైన విధానాలను, వాటిని అమలు చేయడానికి చట్టాలను, నిబంధనలను రూపొందిస్తున్నాయని ఆరోపించారు. సమాంతరంగా అదే కాలంలో తమకున్న అధికారాన్ని ఉపయోగించి పాలకవర్గ ప్రతిపక్ష పార్టీలపై దాడులు నిర్వహించి రాజ్యాంగంపై సంపూర్ణ ఆధిపత్యాన్ని సాధించి దేశంపై ఫాసిస్టు నియంతృత్వాన్ని రుద్దడానికి ప్రయత్నిస్తూ ఉందని తెలిపారు. ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న ప్రజా ఉద్యమాలు, కార్యకర్తలపైన "ఉపా" లాంటి ఇతర క్రిమినల్ చట్టాలను పెద్ద ఎత్తున ఉపయోగిస్తూ ప్రజాస్వామిక వాతావరణాన్ని నాశనం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ విధానాలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎండి. చాంద్ పాషా, జిల్లా కమిటీ సభ్యులు జగజంపుల తిరుపతి, బండారు తిరుపతి పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక బీజేపీని ఓడించండి

- సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

వచ్చే నెల 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కార్మిక వ్యతిరేక, కార్పొరేట్, మతోన్మాద బీజేపీని ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు పిలుపునిచ్చారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం నిర్వహించిన సీఐటీయూ జిల్లా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కనీస వేతనం రూ. 26 వేలు చెల్లిస్తే తప్ప సగటు కార్మికుడు బతకలేని పరిస్థితి ఉందన్నారు. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. ఈ కోడ్ల వల్ల కార్మికులు సంఘాలు పెట్టుకునే హక్కు కోల్పోయారన్నారు. ఎనిమిది గంటల పని విధానం రద్దుచేసి 12 గంటలకు నిర్ణయించిందని దుయ్యబట్టారు. కోట్లాది అసంఘటిత రంగ కార్మికులకు వర్తించే ఈపీఎస్, పెన్షన్ నెలకు పదివేలు పెంచడానికి బీజేపీకి ధైర్యం రావడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరించడానికి అంగీకరించడం లేదన్నారు. 2022 విద్యుత్ సవరణ చట్టాన్ని తెచ్చి ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకొని కార్పొరేట్ విద్యుత్ కంపెనీలకు వేల కోట్ల లాభాలు కట్టబెట్టేందుకు తెగించిందన్నారు. దీని ప్రభావం రైతాంగంపై తీవ్రంగా పడనుందన్నారు. వినియోగదారులు




మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు



పాల్గొన్న సీఐటీయూ, అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు

ఇప్పుడు చెల్లిస్తున్న యూనిట్ ధర కంటే అనేక రెట్లు కరెంట్ బిల్లులు చెల్లించాల్సి వస్తుందని వాపోయారు. మోటార్ వెహికిల్ యాక్ట్ 2019 చట్ట సవరణ ద్వారా దేశంలోని సుమారు 16 కోట్ల మంది రవాణా రంగ కార్మికులకు ఉపాధి దెబ్బతిందన్నారు. వివిధ ప్రమాదాలకు రవాణా రంగ కార్మికులను బాధ్యులుగా చేసి రూ. పది లక్షల పెనాల్టీ, రెండేళ్ల జైలు శిక్షలకు గురిచేసి హిట్ అండ్ రన్ చట్టాన్ని తెచ్చిందని మండిపడ్డారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల వాటాల విక్రయం ద్వారా సుమారు రూ.నాలుగు కోట్ల 90 లక్షల ఆదాయాన్ని సమకూర్చే పేరుతో ప్రభుత్వ రంగాన్ని బలహీనపరిచిందన్నారు. ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఇచ్చి మోసగించిందని, నల్లధనం తీసుకొచ్చి జన్ ధన్ ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని మోసగించిందన్నారు. నిరుద్యోగం గత 50 సంవత్సరాల గరిష్ట స్థాయికి చేరిందని, శ్రామికుల నిజ వేతనాలు 20 శాతం తగ్గాయన్నారు. డిమానిటైజేషన్ ద్వారా 15 కోట్ల మంది రోజువారి కూలీలు ఉద్యోగాలు కోల్పోయారన్నారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల్లో సీఐటీయూ శ్రేణులు అభిమానులు బీజేపీని ఓడించాలని సదస్సులో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. త్రివేణి, శ్రీకాంత్, సహాయ కార్యదర్శి పద్మ, జిల్లా నాయకులు శంకర్, సంజీవ్, కృష్ణమాచారి, విలాస్, అంకయ్య, విఠల్, మడావి చెంద్రకళ, రాజేశ్వరి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

## దేవుళ్ల పేరుతో బీజేపీ రాజకీయం చేయడం సరికాదు

- పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క

నవతెలంగాణ-కెరమెరి

దేవుళ్ళ పేరుతో బీజేపీ పార్టీ రాజకీయం సరికాదని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశానికి చేసింది, చేసేది చెప్ప లేక రాజకీయాల కోసం బీజేపీ దేవుళ్లని వాడుడుకుంటున్నదని విమర్శించారు. దేవుడి పేరుతో రాజకీయం చేసి దేవున్ని రోడ్ల మీదకు తెచ్చిన బీజేపీ వాళ్ల దేశభక్తులు..? దేశం కోసం పాటు పడిన ఇందిరమ్మ కుటుంబం మాత్రం దేశ ద్రోహులయ్యారా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలోనే దేశంలో రేషన్, విద్య, ప్రాజెక్టులు, రేషన్‌కార్డులు, ఇతర పథకాలు వచ్చాయన్నారు. ఆదివాసీ మహిళ ఆత్రం సుగుణను ఆదిలాబాద్ ఎంపీగా గెలిపించాలని కోరారు. ఆదివాసీమహిళ ఎంపీగా ఉంటే పార్లమెంటులో తనగొంతు వినిపించి ఈప్రాంతాన్ని అభివృద్ధి చేస్తుందన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ మాట్లాడుతూ ఆదివాసీ పేదింటి మహిళగా తనను ఒక్కసారి ఆశీర్వదించాలని, ఈ ప్రాంతాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ ఆదివాసీ ప్రాంతాలను అభివృద్ధి చేయలేదన్నారు. కార్పొరేట్‌లకు అడవులను అప్పగించేల చట్టాలను తెచ్చిందన్నారు. ఆదివాసులను అన్యాయం చేస్తున్న బీజేపీకి గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం వివిధ పార్టీల నుంచి మంత్రి సీతక్క సమక్షంలో పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఎమ్మెల్యే కోకిరాల ప్రేమ్ సాగర్ రావు, ఆసిఫాబాద్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కోకిరాల విశ్వప్రసాద్ రావు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోల చారి, శ్యాంనాయక్, మాజీ ఎమ్మెల్సీ పురాణంసతీష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ హైమ్మద్, రాథోడ్ శేషారావు, మండల అధ్యక్షులు కుసుంబ్ రావు, దండుగుల ఎల్లప్ప, రాథోడ్ శంకర్, పెందూర్ జల్పత్ రావు, లింబరావు, దండుగుల శ్రీనివాస్, కుటికెల వెంకటస్వామి, నగేష్, రమేష్, బాబు నాయక్, కొట్రంగే తిరుపతి పాల్గొన్నారు.

## కోర్టు ఆదేశాలతో పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ



పీఏసీఎస్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న హర్షద్‌హుస్సేన్

నవతెలంగాణ-బెజ్జూరు

కోర్టు ఆదేశాలతో ఆదివారం బెజ్జూరు పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించినట్టు హర్షద్‌హుస్సేన్ తెలిపారు. గతంలో తనపై అనర్హతపై కొందరు కోర్టుకు వెళ్లగా తనకు అనర్హత ప్రకటించకూడదని కోర్టు ఉన్నప్పటికీ తనను అనర్హుడిగా ప్రకటించి పీఏసీఎస్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. కోర్టు ద్వారా తిరిగి ఆర్డర్ తీసుకొచ్చామని, చివరికి న్యాయం గెలిచిందన్నారు. న్యాపోరాటంతో తనకు కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. ఈ మేరకు పీఏసీఎస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించినట్టు పేర్కొన్నారు. రైతులకు సకాలంలో రుణాలు ఇవ్వడం, ఎరువులు అందజేయడంతో పాటు వారికి అందుబాటులో ఉంటామన్నారు. కోర్టు ఆర్డర్ కాపీలను పీఏసీఎస్ ఉన్నతాధికారులు, ఈఓకు అందజేసినట్టు ఆయన తెలిపారు.

## ప్రశాంతంగా ముగిసిన ఎంజేపీ గురుకుల పరీక్ష



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ డిగ్రీ ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ప్రవేశ పరీక్ష కోసం జిల్లాలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంజేపీ జిల్లా కన్వీనర్ వెంకట ప్రసాద్ తెలిపారు. వీటిలో రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం 583 మంది దరఖాస్తు చేసుకోగా 515 మంది హాజరయ్యారని 68 మంది గైర్హాజరయ్యారని, 88 శాతం హాజరు నమోదయిందన్నారు. రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సులో ప్రవేశాల కోసం 419 మంది దరఖాస్తు చేసుకోగా 385 మంది హాజరయ్యారని, 34 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్ష ఫలితాలను త్వరలోనే విడుదల చేస్తామన్నారు. అర్హత సాధించిన విద్యార్థులు అడ్మిషన్లు పొందుతారన్నారు. ప్రవేశ పరీక్షను ఆయనతో పాటు ఉదయ బాబు పర్యవేక్షించారు.



# కార్మిక చట్టాలను కాలరాస్తున్న ప్రభుత్వాలు

- పోరాడి సాధించుకోవాలి : కార్మిక సంఘాల నాయకులు



హమాలీ పనులు చేస్తున్న కూలీలు

నవతెలంగాణ - సిర్పూర్(టి)

కార్మిక దినోత్సవం ఆవిర్భావాన్ని ఏ ఒక్క దేశానికో, సంఘటనకో ముడిపెట్టలేం. కానీ 1886 సంవత్సరంలో చికాగోలోని బీహేగ్ మార్కెట్‌లో జరిగిన కార్మికుల ప్రదర్శనే ఈ మేడే పుట్టుకకు పునాది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత యూరోపియన్ దేశంలో మే ఒకటిన సెలవు దినంగా పాటిస్తూ పని గంటలు తగ్గిస్తూ మొదలుపెట్టారు. అలాగే అన్ని దేశాల్లో కార్మికులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలు ఆ రోజునే అమల్లోకి రావడం మొదలయ్యాయి. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తికావస్తున్నా దేశంలోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఏ ప్రభుత్వం కూడా న్యాయం చేయలేకపోతున్నాయి. దీనికి ఉదాహరణే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వివిధ స్కీంలలో పనిచేస్తున్న కార్మికుల పరిస్థితి. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ, వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, పార్ట్‌టైం కార్మికుల పరిస్థితి అధ్వానంగా ఉంది. ప్రభుత్వం, పెట్టుబడిదారి సంస్థలో పనిచేస్తున్న కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తూ అధిక పని భారం మోపి వేతనాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. కార్మికుల చట్టాలు పకడ్బందీగా అమలు చేయాల్సి ఉండగా ఆ దిశగా ఎక్కడ చూడా చర్యలు తీసుకోవడం లేదు. సుప్రీంకోర్టు ప్రభుత్వాలు, ప్రయివేటు సంస్థలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సూచించిన వాటిని అమలుపరచడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. సమస్యలు పరిష్కరించడంలో కేవలం కమ్యూనిస్టు పార్టీలే తప్పా ఏ ఒక్క పార్టీ వారి వర్గాన ఉండి పోరాటం చేసిన చరిత్ర లేదు. ప్రభుత్వ వివిధ స్కీంలలో పనిచేస్తున్న కార్మికులు కొన్నేండ్ల నుండి తమ న్యాయమైన డిమాండ్లు నాలుగు లేబర్ కోడల్‌లను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను అమలుచేసి పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాడ్యూటీ, బోనస్, పెన్షన్ చట్టాలను అందరికి అమలు చేయాలని, హమాలీ, ఆటో, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాలను తేవాలని, ఎన్‌హెచ్‌ఎం, స్కీం ఆల్ క్యాడర్ రెండవ ఏఎన్ఎం, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నభోజనం, గురుకుల పాఠశాలల్లో స్వీపర్లకు జీతాలు పెంచాలని, ఉపాధిహామీ కార్మికులకు 200 రోజులు పని కల్పించి రోజుకు రూ.600 పెంచాలని, ధరలకు అనుగుణంగా కనీస వేతనాల జీవోలను సవరించాలని వివిధ కార్మిక సంఘాలు ప్రభుత్వానికి విన్నవించిన ఏ ఒక్క సమస్యను కూడా పరిష్కరించడం లేదన్నారు.

### కార్మికుల చట్టాలను అమలు చేయాలి


కృష్ణమాచారి, జిల్లా నాయకులు సీఐటీయూ, ఆసిఫాబాద్



కార్మికుల చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కి వారి స్వార్థం కోసం పెట్టుబడిదారులకు కొమ్ముకాసే విధంగా ఉన్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏండ్లు గడుస్తున్న కార్మికుల పరిస్థితి రోజురోజుకు దిగజారే విధంగా ప్రభుత్వాలు చేస్తున్నాయి. ఇలాగే ఉంటే భవిష్యత్తులో కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటుంది. పోరాడితే పోయేది బానిస సంకెళ్ల తప్పా ఏమీలేదు అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకొని కార్మికులు పోరాటం చేసి తమ హక్కులను కాపాడుకొనే బాధ్యత మనపై ఉంది.

### కార్పొరేట్లకు అనుకూలం మోడీ ప్రభుత్వం

బోగె ఉపేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏఐటీయూసీ ఆసిఫాబాద్.



కార్మికులు ఎన్నో పోరాటాలు, త్యాగాలు, కేసులు బరించి 44 కార్మిక చట్టాలను సాధించుకున్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా తయారు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 12 గంటల పని విధానాన్ని అమలు చేయాలని ప్రయత్నిస్తుంది. ఇలాంటి ప్రభుత్వాలు దేశాన్ని పరిపాలిస్తే మేడేకు పూర్వం ఉన్న కార్మికుల పరిస్థితి పునరావృతమయ్యే అవకాశముంది. కార్మికులు మేల్కోని వ్యతిరేక ప్రభుత్వంపై తిరగబడాలి.

నవతెలంగాణ
మంచిర్యాల
సోమవారం | ఏప్రిల్ 29, 2024 | www.navatelangana.com

## బీఆర్‌ఎస్‌లో పలువురు బీజేపీ నాయకుల చేరిక

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కామన్‌పల్లి గ్రామంలో జన్నారం ఏఎంసీ మాజీ డైరెక్టర్ తేజావత్ భరత్ నాయక్ తన అనుచరులతో, బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు పేరం శ్రీనివాస్, నాయకులు ఫజల్ ఖాన్, రాజు నాయక్, జునుగురు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్, పసుల రాజన్న, బైకం లక్ష్మణ్, కామెర దుర్గయ్య, జునుగురు గణేష్ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఎంజేబీ, ఆర్జేసీ సెట్

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాలలోని ఎనిమిది కేంద్రాల్లో ఆదివారం ఎంజేబీ, ఆర్జేసీ సెట్ ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో 1327 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోగా 1201 మంది విద్యార్థులు హాజరయ్యారని, 578 మంది విద్యార్థులు డిగ్రీలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోగా 540 మంది విద్యార్థులు హాజరయ్యారని మొత్తంగా 1905 మందికి గాను 1741 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. జిల్లాలోని పరీక్ష కేంద్రాలను హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా వచ్చినా మహాత్మా జ్యోతిబా పూలేల జాయింట్ సెక్రటరీ తిరుపతి సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు.

## కవ్వాల్ టైగర్ జోన్‌లో భారీ వాహనాల ఆంక్షలు ఎత్తివేయాలి



నవతెలంగాణ-జన్నారం

